క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా ఉంటాం

డాక్టర్ జగన్‌మోహనరావు



నందిగామ టౌన్: రాజకీయాల్లోని వచ్చిన నాటి నుంచి తమకు అండగా నిలిచిన వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలకు రుణపడి ఉంటామని నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. స్థానిక ఆయన నివాసంలో శనివారం ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అండగా ఉంటానని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసి పేదలకు అండగా నిలవాలని సూచించారు. 2014 ఎన్నికల సమయంలో ప్రజా సమస్యలపై ప్రజల తరఫున పోరాడామని 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత తమవంతుగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశామని గుర్తు చేశారు. గడిచిన ఐదేళ్లు ప్రజాజీవనానికి ఆటంకం కలుగకుండా శాంతియుత పాలన అందించామని టీడీపీ అధికారంలోకి వచ్చిన మూడురోజులుగా టీడీపీ నేతలు ఉన్మాదుల్లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దని, తాము అండగా ఉన్నామని హామీ ఇచ్చారు. ఇకనైనా పోలీసులు స్పందించి దౌర్జనాలకు పాల్పడుతున్నవారిపై తగిన చర్యలు తీసుకుని నియోజకవర్గంలో శాంతిభద్రతలను పరిరక్షించాలని డాక్టర్ జగన్‌మోహనరావు కోరారు.

రౌడీషీటర్లు తీరు మార్చుకోవాలి : ఎస్‌ఐ

వీరులపాడు: రౌడీ షీటర్లు తమ ప్రవర్తన మార్చుకుని నడుచుకోవాలని ఎస్‌ఐ మహాలక్ష్ముడు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన రౌడీషీటర్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ రౌడీషీటర్‌లు తమ ప్రవర్తన మార్చుకోవాలని లేకుంటే కఠిన చర్యలుంటాయన్నారు. సత్ప్రవర్తనతో నడుచుకునే వారిని గుర్తించి వారిపై ఉన్న రౌడీషీట్ తొలగించేలా ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామని వివరించారు. ముఖ్యంగా నేరచరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందన్నారు. అల్లర్లు, ఘర్షణ వాతావరణం సృష్టిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

సచివాలయంపై టీడీపీ మూకల దౌర్జన్యం



కంచికచర్ల : నియోజకవర్గంలో రోజురోజుకు టీడీపీ కార్యకర్తల దాష్టీకాలు హద్దులు దాటుతున్నాయి. మొన్న మోగులూరు, వేములపల్లిలో దాడులకు పాల్పడిన ఆపార్టీ కార్యకర్తలు, తాజాగా గండేపల్లిలో ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. ఏకంగా గ్రామ సచివాలయానికి ఏర్పాటు చేసిన కిటికీల అద్దాలను శుక్రవారం అర్ధరాత్రి పగులగొట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా గ్రామాల్లో పలువురు టీడీపీ కార్యకర్తలు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు చెబుతుండగా, ఈ విషయంపై తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఎస్‌ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం శనివారం తెలిపారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువకుడు అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లో తమ్మిన తేజ దుర్గ వెంకట్ తన కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. వెంకట్ బీసెంట్‌రోడ్డులోని ఓ బట్టల దుకాణంలో అకౌంటెంట్‌గా పని చేస్తుంటాడు. ఈ నెల 5న డ్యూటీకి వెళ్లుతున్నానని చెప్పిన వెంకట్ సాయంత్రం అయినా తిరిగి రాలేదు. బయటకు వెళ్లే సమయంలో ఫోన్‌లోని సిమ్ కార్డు తీసుకుని, ఫోన్‌ను ఇంట్లోనే వదిలేశాడు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, షాపులో వారిని ఆరా తీసినా ప్రయోజనం లేదు. దీంతో వెంకట్ సోదరుడు ఠాగూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మోపెడ్ దగ్ధంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి ముందు పెట్టిన మోపెడ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేసిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట కోమల విలాస్ సెంటర్ సమీపంలోని గులామ్‌మొహిద్దీన్ వీధిలో నిమ్మగడ్డ నాగ వెంకటరమణ నివాసం ఉంటున్నాడు. వెంకటరమణ వస్త్రలతలో బట్టల వ్యాపారం చేస్తుంటాడు. వెంకట రమణ యాక్టివా మోపెడ్‌ను వినియోగిస్తుంటాడు. శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చిన వెంకట రమణ తన మోపెడ్‌ను ఇంటి ముందు పెట్టి తాళం వేశాడు. తెల్లవారుజామున వెంకట రమణ ఇంటి సమీపంలో నివాసం ఉండే సుధాకర్ ఫోన్ చేసి మోపెడ్ కాలిపోతుందని చెప్పాడు. దీంతో కిందకు వచ్చి చూసే సరికి మోపెడ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేయడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పెనుగంచిప్రోలులో ట్రాఫిక్ కష్టాలు

- అమ్మవారి దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు
- ఆది, శుక్రవారాల్లో అధికంగా భక్తుల రాక
- వందలాది వాహనాల రాకతో పెరుగుతున్న ట్రాఫిక్
- పార్కింగ్‌కు స్థలం లేక అవస్థలు
- రోడ్లపైనే నిలుస్తున్న వాహనాలు
- ఇబ్బందుల్లో గ్రామస్తులు, భక్తులు



పెనుగంచిప్రోలు పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనం నిమిత్తం తరలివచ్చే భక్తుల సంఖ్య, వాహనాల రద్దీ రోజురోజుకు పెరుగుతుండటంతో పెనుగంచిప్రోలులో ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. నిత్య వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తుండగా, ఆది, శుక్రవారాల్లో మాత్రం వేలాది మంది భక్తులు దర్శనానికి వస్తున్నారు. ఆంధ్రా నుంచేగాక తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా ఈ రెండు రోజుల్లో భక్తులు వందలాది వాహనాల్లో తరలివస్తుండటంతో వాహనాల పార్కింగ్ సైతం కష్టంగా మారింది. వాహనాల రద్దీతో పెనుగంచిప్రోలులో ఈరెండురోజుల్లో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి.

ఇరుకు రోడ్లే కారణం...

గ్రామంలోని నాలుగు రోడ్ల కూడలి పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో రోడ్లు ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్ కష్టాలు మరింత పెరుగుతున్నాయి. ముఖ్యంగా భక్తులు కాజ్‌వే పైనుంచి మునేరు అవతల మామిడి తోటల్లోకి వెళ్లి వంటలు చేసుకొని భోజనాలు చేయటం ఆనవాయితీగా వస్తోంది. అయితే రోడ్డుకు రెండు వైపులా వ్యాపారాలు చేసుకునేవారు రోడ్డు మీదకు దుకాణాలు పొడిగించడంతో వాహనాలు వెళ్లే పరిస్థితి కనిపించటం లేదు. పోలీస్‌స్టేషన్ సెంటర్ నుంచి శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి వెళ్లే రహదారి కూడా బాగా ఇరుకుగా ఉండటంతో బస్సు వస్తే ఎదురుగా బైక్ కూడా వెళ్లే పరిస్థితి నెలకొంది. ఇటీవల ఈరోడ్డును రూ.25లక్షలతో అభివృద్ధి చేసినప్పటికీ ఇరుకుగా ఉండటంతో భక్తులు ఇబ్బందులుపడుతూనే ఉన్నారు. శుక్ర, ఆదివారాల్లో ఆలయానికి వందల సంఖ్యలో కార్లు, బైక్‌లు ఇతర వాహనాలు వస్తున్నాయి. ఆలయయం వద్ద కూడా వాహనాలు పార్కింగ్ చేసేందుకు స్థలం లేక పోవటంతో ఆలయం చుట్టూ వాహనాలు నిలుపుతున్నారు. దీంతో భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసేందుకు కూడా వీలులేని పరిస్థితి. దీనికి తోడు వాహనాల పూజ గతంలో ఆలయం పక్కన ఉండేది. ఇప్పుడు ఆలయం ముందు స్టాప్ బోర్డులు అడ్డం పెట్టి వాహనాల పూజలు చేస్తుండటంతో భక్తులు ప్రదక్షిణలు చేసేందుకు అవస్థలు పడుతున్నారు. పెనుగంచిప్రోలులో ఆది, శుక్రవారాల్లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు దేవాదాయ, పోలీసుశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవడంతోపాటు ఆలయానికి వచ్చే వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయడం ద్వారా ఆలయం చుట్టూ వాహనాలు నిలుపుదల చేయకుండా చూడాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.



ఆలయానికి వెళ్లే దారిలో ట్రాఫిక్ పరిస్థితి



ఆలయం చుట్టూ వాహనాల పార్కింగ్

చర్యలు చేపడుతున్నాం..



భక్తుల రద్దీ దృష్ట్యా పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో శుక్ర, ఆదివారాల్లో అదనపు సిబ్బందితో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపడుతున్నాం. రోడ్డుకు ఇరువైపుల ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేస్తాం. ఇంకా అవసరమైన చర్యలు చేపడతాం.

– పి రాంబాబు, ఎస్‌ఐ

పార్కింగ్ సదుపాయం కల్పిస్తున్నాం..



శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద పార్కింగ్ ఇబ్బందులు త్వరలో తొలగిపోయేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే అమ్మవారి వార్షిక కల్యాణం జరిగే చోట పార్కింగ్ సదుపాయం కల్పిస్తున్నాం. మైత్రి రోడ్డు నిర్మాణం జరుగుతోంది. ఈ రోడ్డు పనులు పూర్తయితే వాహనాల పార్కింగ్ ఇబ్బందులు తొలుగుతాయి.

– కె.రమేష్‌నాయుడు, ఈఓ

ట్రాఫిక్‌కు అవరోధంగా పశువులు





జగ్గయ్యపేటలో రోడ్లపై యథేచ్ఛగా సంచరిస్తున్న ఆవులు

- వాహనాల రాకపోకలకు అడ్డంకి
- తరచూ నిలిచిపోతున్న ట్రాఫిక్
- ఇబ్బందుల్లో జగ్గయ్యపేట ప్రజలు

జగ్గయ్యపేట అర్బన్ : పరిశ్రమల పట్టణంగా రోజురోజుకు పెరిగిపోతున్న వాహనాల రద్దీతో పేట పట్టణంలో ఒకవైపు ట్రాఫిక్ తరచూ నిలిచిపోతుండగా, యధేచ్ఛగా రోడ్లపై సంచరిస్తున్న పశువులతో ట్రాఫిక్‌కు మరింత అంతరాయం కలుగుతుంది. దీంతో పలు ప్రాంతాలలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా రైతుబజారు, ఆర్టీసీ బస్టాండ్, మున్సిపల్ కూడలి, ముక్త్యాల బస్టాండ్, బలుసుపాడు సెంటర్‌లలో ఆవులు రోడ్లపై యథేచ్ఛగా సంచరిస్తుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అవరోధం ఏర్పడుతోంది. రైతుబజారు వద్ద కూరగాయల తోపుడుబండ్లు, లోపల కాయకూరల స్టాల్స్ నుంచి పాడైపోయిన కూరగాయలు, ఆకు కూరలను వ్యాపారులు బయట పడవేయటంతో వాటిని తినేందుకు ఎక్కువగా పశువులు ఆప్రాంతంలో సంచరిస్తున్నాయి. దీంతో రైతు బజారు వద్ద రోడ్డుపై తోపుడు బండ్లతోనే ఇరుకుగా ఉంటున్న రహదారి కాస్తా, ఈ పశువుల సంచారం కారణంగా మరింత ఇరుకుగా మారి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

నిరుపయోగంగా బందెలదొడ్డి..

పట్టణంలో ఏడు దశాబ్దాల కిందట శ్రీరేణుకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం ఎదురుగా ఉన్న స్థలంలో నిర్మించిన బందెలదొడ్డి నిరుపయోగంగా మారింది. పదేళ్ల కిందట ఈ బందెలదొడ్డిని పురపాలక సంఘం వారు ఆధునీకరించి కొంత కాలం ఉపయోగించారు. అయితే బందెల దొడ్డిలో ఉంచిన పశువులను వాటి యజమానులు జరిమానా చెల్లించి విడిపించుకోవాల్సి ఉండగా, ఎక్కువ మంది జరిమానాలు చెల్లించకుండా రికమెండేషన్లు చేయిస్తూ ఉండటంతో బందెల దొడ్డి నిర్వహణ భారంగా మారి, అదికాస్తా నిరుపయోగంగా మారింది. ట్రాఫిక్‌కు సమస్యగా మారిన పశువులను నిరోధించేందుకు గతంలో మున్సిపల్, పోలీసు శాఖల అధికారులు పలు చర్యలు చేపట్టిన ఫలితం శూన్యం. రోడ్లపై కనిపించిన పశువులను మార్కెట్ యార్డుకు ఒకసారి, వాసవి గ్రంథాలయం సమీపంలో ఉన్న పప్పుమిల్లు దొడ్డిలో, పెనుగంచిప్రోలులోని గోశాలకు తరలించేవారు. వారాలపాటు ఆయా పశువుల కోసం యజమానులు ఎవ్వరూ రాకపోతుండటంతో వాటి సంరక్షణ భారంగా మారడం పోలీసులకు కొత్త సమస్యలను తెచ్చిపెట్టింది. పట్టణంలోని రోడ్లపైకి ఆవులు తదితర పశువులను వదిలివేస్తే సహించేది లేదని, వాటిని పట్టి నిర్బంధించడంతో పాటు యజమానులపై కేసులు నమోదు చేస్తామని జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్, పోలీసు అధికారులు ప్రకటించినప్పటికీ పశువుల యజమానుల వైఖరుల్లో మార్పు మాత్రం కనిపించడం లేదు. పశువుల కారణంగా ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడం లేదు. ఇకనైనా రోడ్లపైకి పశువులను వదిలిపెట్టే వారిపై మున్సిపల్, పోలీసు అధికారులు కఠిన చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని జగ్గయ్యపేట పట్టణ ప్రజలు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న బందెలదొడ్డి

పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గం ఎన్నిక



పేట నియోజకవర్గ ఎబినేజర్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గ సభ్యులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గ ఎబినేజర్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక యేసయ్య జవాబు చర్చిలో జరిగిన పాస్టర్ల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు ఎన్నుకున్నారు. పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవాధ్యక్షులుగా రెవరెండ్ ప్రభుదాసు, అధ్యక్షునిగా నకిరికంటి జోసఫ్ కిరణ్, కార్యదర్శి, కోశాధికారులుగా కరిసె రవికుమార్, హానోక్‌నాయక్, సంయుక్త కార్యదర్శి, ఉపకోశాధికారులుగా బి.చంద్రపాల్, కేజే.హెన్రీ, ఉపాధ్యక్షులుగా కె.అశోక్, కె.ఆశీర్వాదం, డి.ఆనందరావు, గౌరవ సలహాదారులుగా బీవైసీ సాల్మన్ ప్రసాద్, జి.దేవసహాయం, ప్రతాప్, కోఆర్డినేటర్లుగా డేనియల్ ఎజ్రాశాస్త్రి, శామ్యూల్ నిరీక్షణ, జాన్ రమ్యబాబు, ఎల్.ప్రవీణ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రూపస్‌బాబు, ఎం.అగస్టీన్, జి.విజయరాజు, ఎం.లాజర్, కెఎన్‌ఆర్‌పాల్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

రామోజీరావుకు ఎమ్మెల్యేల నివాళులు



జగ్గయ్యపేట అర్బన్: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతిపట్ల జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే తాతయ్య నివాసంలో ఏర్పాటు చేసిన సంతాప సభ కార్యక్రమంలో రామోజీరావు చిత్రపటానికి వారు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పత్రికా రంగానికి రామోజీరావు చేసిన సేవలను కొనియాడారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాలనీలో ఇంటి ముందు నిలిపిన బైక్ చోరీకి గురైన ఘటనపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో బ్లాక్ నంబర్ 96లో మహంకాళి వెంకన్న కుటుంబం నివాసం ఉంటోంది. లారీ డ్రైవర్‌గా పని చేసే వెంకన్న ఈ నెల 2న తన బైక్‌ను ఇంటి ముందు పార్క్ చేశాడు. మరుసటి రోజు ఉదయం నిద్ర లేచి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన భర్త కనిపించడం లేదంటూ వివాహిత ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రైజర్‌పేట జగ్గపిల్ల రామారావు వీధిలో గిరిజాల నాగమణి, రాజేష్‌ల కుటుంబం నివాసం ఉంటోంది. వీరికి ఒక పాప సంతానం కాగా రాజేష్ బంగారం పని చేస్తుంటాడు. ఈ నెల 1వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాజేష్ సాయంత్రం అయినా తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన అతని భార్య నాగమణి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

క్రీడలతో చిన్నారుల్లో శారీరక దృఢత్వం



శిక్షణ పొందిన చిన్నారులతో రైల్వే అధికారులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): క్రీడలతో మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందని విజయవాడ రైల్వే ఏడీఆర్‌ఎం పి.ఈ.ఎడ్విన్ పేర్కొన్నారు. విజయవాడ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు వేడుకలు శనివారం రైల్వే మినీ స్టేడియంలో జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏడీఆర్‌ఎం పిల్లలను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా చిన్న వయస్సు నుంచే పోటీతత్వం, టీం వర్క్ అలవడుతుందన్నారు. క్యాంప్‌లకు తమ పిల్లలను పంపించిన తల్లిదండ్రులను ఆయన అభినందించారు. అనంతరం అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, క్రికెట్, వాలీబాల్, టెన్నిస్ తదితర క్రీడల్లో శిక్షణ పొందిన 68 మంది పిల్లలకు సర్టిఫికెట్‌లు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ డీఎస్‌సీ, డివిజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్ వల్లేశ్వర్ బి.టి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన అవసరం



రైల్వే హాస్పిటల్‌లో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శౌరిబాల

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన అవసరమని రైల్వే హాస్పిటల్ సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల పేర్కొన్నారు. ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రైల్వే హాస్పిటల్ న్యూ ఓపీడీ భవనంలో బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శౌరిబాల మాట్లాడుతూ.. బ్రెయిన్ ట్యూమర్‌ను ముందుగానే గుర్తిస్తే నివారించవచ్చన్నారు. బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, లక్షణాలు, చికిత్స తదితర వివరాలను వివరించారు. పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి బ్రెయిన్ ట్యూమర్ నివారణలో ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. వ్యాధిని ముందుగా గుర్తించేందుకు ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏసీఎంఎస్ డాక్టర్ ఎం.జైదీప్, ఏవోఐ హాస్పిటల్ రేడియాలజిస్ట్ డాక్టర్ సాయి స్నేహిత్, డాక్టర్ హసీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ సేవల్లో యువత భాగస్వాములు కావాలి



షేక్ సైదాకు నియామక పత్రం అందజేస్తున్న నాగుల్‌మీరా

పాయకాపురం(విజయవాడ రూరల్): ముస్లిం మైనార్టీలకు ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) ద్వారా అందజేస్తున్న సేవా కార్యక్రమాల్లో ముస్లిం యువత భాగస్వాములు కావాలని ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా సూచించారు. స్థానిక 64వ డివిజన్ టింకరింగ్ షెడ్ వద్ద శనివారం ఏఎంసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగుల్‌మీరా మాట్లాడుతూ ముస్లింల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా ఆజాద్‌ముస్లిం కమిటీ సేవలను అందజేస్తుందన్నారు. కమిటీలో కొత్తగా చేరే ప్రతీ ఒక్కరూ, ముఖ్యంగా యువత ముందుకు వచ్చి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. 61వ డివిజన్ ఆజాద్‌ముస్లిం కమిటీ అధ్యక్షుడిగా షేక్ సైదాను నియమించి నియామక పత్రాన్ని అందజేశారు. ఏఎంసీ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నున్న గ్రామంలోని పేద ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు. సమావేశంలో సెంట్రల్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు అన్వర్‌బేగ్, ప్రధాన కార్యదర్శి జానీ బాషా, సహాయ కార్యదర్శి సిలార్ బేగ్, పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు

నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు బాలాశర్మ ఆధ్వర్యంలో శనీశ్వరుడికి ప్రత్యేక తైలాభిషేకాలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు.

17 నుంచి కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ తరగతులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): బందరురోడ్డు, రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 17వ తేదీ నుంచి కంప్యూటర్ కోర్సుల్లో కొత్త బ్యాచ్‌లకు శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ఎం.బి.విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ విభాగం బాధ్యుడు టి.క్రాంతికిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎం.ఎస్.ఆఫీస్, డీటీపీ, సీ లాంగ్వేజ్, ట్యాలీ కోర్సులకు శిక్షణ ఇస్తామన్నారు. ప్రతి కోర్సుకు 2 నెలలు శిక్షణ ఉంటుందన్నారు. అతి తక్కువ ఫీజుతో అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో నాణ్యమైన విద్యను గత 8 సంవత్సరాలుగా వేలాది మందికి అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు, గృహిణులు, జాబ్ చేస్తున్న వారు ఎవరైనా వయసుతో సంబంధం లేకుండా ఈ కోర్సులు నేర్చుకోవడానికి అర్హులన్నారు. ఆసక్తి కలవారు తమ కార్యాలయంలో లేదా 73821 93413, 94900 98042 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

అమ్రితసాయిలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



విద్యార్థినికి ప్రశంసాపత్రాలను అందజేస్తున్న జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు



అమ్రితసాయి విద్యార్థులతో వీసీ ప్రసాదరాజు, కళాశాల యాజమాన్యం

కంచికచర్ల : పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ కె.రామ్మోహనరావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా విచ్చేసిన కాకినాడ జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ డాక్టర్ జీవీకే ప్రసాదరాజు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఇంజినీరింగ్ విద్యను పూర్తిచేసుకున్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వీసీ డాక్టర్ ప్రసాదరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడంతోపాటు మానవతా విలువలు, సామాజిక బాధ్యత కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో ఇంజినీరింగ్ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా కరిక్యులమ్ నిర్వహిస్తోందంటూ అభినందనలు తెలియజేశారు. కళాశాల ప్రెసిడెంట్ కె.లక్ష్మీ కార్తీక్ మాట్లాడుతూ 2020–24 అటానమస్ బ్యాచ్‌లో 454మంది విద్యార్థులు ఇంజినీరింగ్ డిగ్రీ పట్టా పొందారని, వీరందరికీ ప్రొవిజనల్స్ సర్టిఫికెట్లు అందజేశామన్నారు. ప్లేస్‌మెంట్స్‌లో 243మంది ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ ఆఫర్లతో రూ.12లక్షల అత్యధిక వార్షిక వేతనంతో తమ విద్యార్థులు సత్తా చాటారని వివరించారు. అనంతరం సీఎస్‌సీ బ్రాంచి నుంచి కాలేజీ టాపర్‌గా నిలిచిన ఎం.మృదులతోపాటు, ఆయా బ్రాంచీల టాపర్లుగా నిలిచిన తొమ్మిది మంది విద్యార్థులకు గోల్డ్‌మెడల్‌తోపాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శశిధర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ ఎం.శ్రీదేవి, ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శనివారం భీమవరానికి చెందిన శ్రీ ఉమా సోమేశ్వర కూచిపూడి నృత్య కళాక్షేత్రానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై ఏ.వైష్ణవి శిష్య బృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం శిష్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com